## కార్మికులు హక్కులను సాధించుకోవాలి

హిమాయత్‌నగర్, మార్చి 28: రాష్ట్రంలోని కార్మికవర్గం ఐక్యమై హక్కులను సాధించు కోవాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి పిలుపు నిచ్చారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారి వ్యవస్థను అంతం చేసి, శ్రమ దోపిడీ నుంచి విముక్తి కావల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో మత తత్వ శక్తులు బలపడితే లౌకికవాదం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి పెను ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

ఖైరతాబాద్, మార్చి 28: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్మకు పాల్పడ్డాడు. ఖైరతాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఏఎస్సై శ్రీరాములు వివరాల ప్రకారం.. బీహార్‌లోని పాట్నా జిల్లా రాంపూర్‌కు చెందిన కమలేశ్ కుమార్ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చాడు. మినరల్ వాటర్ సరఫరా చేసే ఆనంద్‌నగర్ కాలనీలోని ఆర్ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్‌లో పనిలో చేరాడు. ఆ షాపు కార్యాలయంలోనే ఉంటూ యజమాని రవికుమార్‌తో కలిసి ఆర్డర్ల మేరకు నీటిని సరఫరా చేస్తున్నాడు. బుధవారం పని ముగియడంతో యజమాని ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు గురువారం దుకాణానికి వచ్చి తలుపులు తెరువగా, కమలేశ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇంకుడు గుంత ఉండాల్సిందే

- ఇంకుడు గుంతలకు ఆర్ డబ్ల్యూ హెచ్ యాప్
- వివరాలు నమోదు చేస్తున్న అధికారులు
- ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి: డీసీ సేవా ఇస్లావత్



యూసుఫ్‌గూడలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న డీసీ సేవా ఇస్లావత్

జూబ్లీహిల్స్, మార్చి 28: వర్షం నీటిని వృథాగా పోనివ్వకుండా ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించేందుకు నగర పాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నది. నగరంలో ఇల్లు ఉంటే ఇంకుడు గుంత ఉండాలన్న నిబంధనను పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు ఇంటింటికీ సర్వే చేపడుతున్నారు. ప్రతిఇంటిలో ఇంకుడు గుంతలు ఉన్నాయా లేదా? అన్నది పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నారు. నగర పాలక సంస్థ నిబంధనల ప్రకారం 300 గజాలపైబడిన గృహ ఆవరణలో విధిగా ఇంకుడుగుంత నిర్మాణం చేపట్టాలన్న ఖచ్చితమైన నిబంధనను అమలు చేసేందుకు సమగ్ర కార్యాచరణ చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఇం కుడు గుంతల ఉద్యమం ఒక ప్రహసనం గా మిగిలిపోకుండా ఆన్‌లైన్‌లో వీటి నమోదు చేపడుతున్నారు. రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ (ఆర్‌డబ్ల్యూహెచ్) సిస్టం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే ఇంటింటికీ సర్వే చేపడుతున్న ఆయా వివరాలను సదరు యాప్‌లో నమోదుచేయనున్నారు. నిర్ధేశిత గృహంలో నిబంధనల ప్రకారం ఇంకుడు గుంత ఉందా.. లేదా, ఒకవేళ లేకపోతే లేదు.. అనే అంశాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయనున్నారు. గతంలో తీసిన ఇంకుడు గుంతలు ఉంటే వాటి వివరాలను.. ఒకవేళ ఈ ఏడాది వాటిని వినియోగంలోకి తెస్తే.. ఇప్పటికీ వినియోగంలోకి తేకుండా ఉంటే ఆయా వివరాలను కూడా యాప్‌లో నమోదు చేయనున్నారు. ఇంటింటికీ సర్వే చేపడుతున్న జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, సిబ్బంది ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవాలని విస్తృత ప్రచారం చేపడుతున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఇంకుడు గుంతల సర్వే కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్ధేశిత గృహాల్లో విధిగా ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవాలని, గతంలో తీసిన ఇంకుడు గుంతలు ఉంటే వాటిని వినియోగంలోకి తేవాలని సూచించారు. ఇప్పటికీ ఇంకుడు గుంతలు లేకుండా ఉన్న గృహాలకు జీహెచ్ఎంసీ నిబంధనలు అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు.



దుర్గానగర్‌లో రోడ్లపై చెత్త వేయవద్దని అవగాహన కల్పిస్తున్న అధికారులు

## రోడ్లపై చెత్త వేయొద్దంటూ అవగాహన

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 28: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మైలార్‌దేవ్‌పల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు టి.ప్రేమ్‌గౌడ్ అన్నారు. చెత్తచెదారాలు రోడ్లపై వేయొద్దంటూ దుర్గానగర్‌లో ప్రజలకు గురువారం జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టి.ప్రేమ్‌గౌడ్ పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజలకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు తమ ఇంటి వద్దకు వచ్చే చెత్తసేకరణ ఆటోరిక్షా కార్మికులకే చెత్తను అందించాలని అన్నారు. రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయడం ద్వారా ఈ ప్రాంతమంతా దుర్గంధభరితంగా మారుతుందన్నారు. దీంతో దోమలు వృద్ధి చెందడంతో పాటు విషజ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నాయని తెలిపారు. వీటిని నివారించేందుకు ప్రతిఒక్కరూ తమ ఇంటితో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను సైతం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది నాయకులు ఉన్నారు.

## తాజ్ కృష్ణాలో డిజైర్ ఎగ్జిబిషన్ ప్రారంభం



బంజారాహిల్స్, మార్చి 28: దేశంలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన ఆభరణాలు, వస్త్రాలు, లైఫ్ స్టైల్ ఉత్పత్తులను నగరవాసులకు అందించేందుకు 'డిజైర్' పేరుతో డిజైనర్ ఎగ్జిబిషన్ గురువారం బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణాలో ప్రారంభమైంది. టాలీవుడ్ హీరోయిన్ అమీక్షా పవార్‌తో పాటు మోడల్స్ వెరైటీ ఆభరణాలను ధరించి సందడి చేశారు. ఈ ప్రదర్శన ఈనెల 30దాకా కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## ఒక సామాజిక వర్గానికే సీఎం మేలు

### కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



శంషాబాద్ రూరల్, మార్చి 28: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కేవలం ఒక సామాజిక వర్గానికి మేలు చేస్తున్నారని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆరోపించారు. చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్ మండలంలోని అమ్మపల్లి ఆలయం నుంచి గురువారం ఆశీర్వాదయాత్ర చేపట్టారు. 14 రోజుల పాటు నిర్వహించే యాత్రను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి హాజరై ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. గతంలో ఎంపీగా పనిచేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేశారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, తోకల శ్రీనివాస్‌రెడ్డి, బుక్క వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, సంగీతరెడ్డి, నర్కూడ మాజీ సర్పంచ్ సిద్ధులు, ఎంపీటీసీ బుక్క ప్రవీణ్, కనుకమామిడి కిట్టు, కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు టిప్పర్ ఢీ.. పలువురికి గాయాలు

శంషాబాద్ రూరల్, మార్చి 28: ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం సంఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శంషాబాద్–షాబాద్ రోడ్డులో వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో షాబాద్ వైపు నుంచి వస్తున్న రాజేంద్రనగర్ డిపో బస్సును శంషాబాద్ వైపు నుంచి వెళ్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో బస్సు ముందుభాగం ధ్వంసమైంది. కాగా డాంబర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ బోల్తాపడింది. టిప్పర్ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.



## ఫేజ్-2లో చర్చి ప్రారంభం

ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఫేజ్ 2లో న్యూజెరూసలేం మినిస్ట్రీస్ ప్రార్థన మందిర పునఃప్రతిష్ఠ కార్యక్రమం గురువారం జరిగింది. కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్ సహా భక్తులకు ఆయన శుభాకాంక్షలు తెలిపపారు. కార్యక్రమంలో ఫిలిప్, భాస్కర్, యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు. – మియాపూర్

## జీటీఎస్ ఆలయ హుండీ లెక్కింపు

వెంగళరావునగర్, మార్చి 28: జీటీఎస్‌కాలనీలోని షిర్డీ సాయిబాబా దేవాలయం హుండీ లెక్కింపు మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ ఈవో జె.జయరామయ్య, పాలక మండలి చైర్మన్ చిన్న రమేశ్, ప్రధాన అర్చకులు దేవేందర్‌శర్మ సమక్షంలో లెక్కించారు. మూడు నెలలకు గాను హుండీల ద్వారా రూ.1,94,132 ఆదాయం సమకూరింది. లెక్కింపు కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యనారాయణ, సిబ్బంది క్లర్క్ జగదీశ్, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





చౌదర్‌గూడలో ఫిరంగినాలాను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు, ఇరిగేషన్ ఏఈ మౌనిక

## ఫిరంగినాలా కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్ రూరల్, మార్చి 28: ఫిరంగినాలాను కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నీరటి మల్లేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని చౌదర్‌గూడ పరిధిలో సుమారు 2కిలో మీటర్ల దూరం వరకు ఫిరంగినాలాను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారని అన్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నాలాను పది ఫీట్లు లోతు తవ్విన రియల్ కంపెనీ ప్రతినిధులు నాలాకు ఇరువైపుల ఉన్న వారి భూమిలోకి పైపులైన్‌వేసి దారి చేస్తున్నారని తెలిపారు. షాబాద్ మండలంలోని చందన్‌వెళ్లి నుంచి ప్రారంభమైన ఫిరంగినాలా శంషాబా ద్ మీదుగా ఇబ్రహీపట్నం పెద్దచెరువు వరకు విస్తరించింది. రియల్ వ్యాపారులు కబ్జా చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వగా సంబంధిత శాఖ ఏఈ మౌనిక అక్కడికి చేరుకొని సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఫిరంగినాలాను పరిశీలించిన వారిలో నాయకులు ఏపూరి పవన్, సోగాకు సిద్ధు, మునుగాల సంజీవ, శివ, మహేశ్, తదితరులు ఉన్నారు.

## ఎస్టీపీ పనులు వేగవంతం చేయాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 28 : కాముని చెరువు వద్ద నిర్మిస్తున్న ఎస్టీపీ పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం బాలాజీనగర్ డివిజన్‌లోని రెయింబో విస్తాస్ రాక్ గార్డెన్ పక్కన నిర్మిస్తున్న ఎస్టీపీ పనులను ఎమ్మెల్యే కృష్ణారావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో చెరువుల పరిరక్షణ, సుందరీకరణలో భాగంగా చెరువుల్లోకి మురుగునీరు చేరకుండా మురుగునీటి శుద్ధికేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తైతే చెరువుల్లోకి స్వచ్ఛమైన నీరు చేరుతుందని, తద్వారా చెరువులు ఆహ్లాదకరంగా మారుతాయన్నారు. చెరువుల్లో దుర్గంధం మాయమవుతుందని, పరిసర ప్రాంతాల్లో దోమల బెడద తప్పుతుందన్నారు. చేపట్టిన పనుల విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టి కి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు పాల్గొన్నారు.



బాలాజీనగర్ డివిజన్‌లో ఎస్టీపీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

### వేడుకగా పశుపతినాథ విగ్రహప్రతిష్ఠ

జగద్గిరిగుట్ట: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ఐక్యత, శాంతి నెలకొనాలని నేతలు ఆకాంక్షించారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీ హౌసింగ్‌బోర్డ్ కాలనీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గురువారం పశుపతినాథ విగ్రహప్రతిష్ఠాపన జరిగింది. గోపుర, ధ్వజప్రతిష్ఠ జరిపారు. అన్నదానం అనంతరం హోమం నిర్వహించారు. సాయంత్రం శివపార్వతుల విగ్రహాలతో ఊరేగింపుగా గ్రామోత్సవం జరిపారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులకు దోహదం

**– విశ్రాంత న్యాయమూర్తి శైలజ**

జూబ్లీహిల్స్, మార్చి 28: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తాయని విశ్రాంత జిల్లా న్యాయమూర్తి టి.శైలజ పేర్కొన్నారు. గురువారం యూసుఫ్‌గూడ డివిజన్ కమలాపురికాలనీలోని భారత భారతి కాన్సెప్ట్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ప్రిన్సిపాల్ జయరాంప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన 70 నమూనాలను తిలకించిన న్యాయమూర్తి వారిని అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తనూజ, మనీశ్‌జ్యోతి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



నమూనాలను తిలకిస్తున్న విశ్రాంత జిల్లా న్యాయమూర్తి శైలజ

# భానుడి భగభగలు..









భానుడి ప్రతాపానికి బంజారాహిల్స్‌లోని రోడ్లన్నీ గురువారం నిర్మానుష్యంగా మారాయి. మధ్యాహ్న సమయంలో ఎండ తాకిడిని తట్టుకోలేక కొందరు పాదచారులు గొడుగులు చేబూని, మరికొందరు వాహనదారులు చల్లని పానియాలు సేవిస్తూ సేదతీరారు. రోడ్డు నం.3, 10, 12 లలో కనిపించిన దృశ్యలను నమస్తే తెలంగాణ కెమెరా క్లిక్ మనిపించింది.

## ప్రభుత్వ పాఠశాలకు 10 కుర్చీల వితరణ



మూసాపేట ప్రభుత్వ(బాలురు)ఉన్నత పాఠశాలకు హైదరాబాద్ వైశ్య యూత్ అసోసియేషన్ సంస్థ 10 కుర్చీలను వితరణగా అందించారు. గురువారం పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నల్ల సంతోష్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మేడిశెట్టి నరేశ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి నాగార్జున, ప్రాజెక్టు మేనేజర్ విజయకుమార్ గుప్తా, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం కృష్ణయ్య పాల్గొన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 28

## ముమ్మరంగా పూడికతీత పనులు

జూబ్లీహిల్స్, మార్చి 28: యూసుఫ్‌గూడ సర్కిల్‌లో వరద ముంపు సమస్యలు తలెత్తకుండా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నాలాల్లో, వరద కాలువల్లో వ్యర్థాలు తొలగింపు పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. ముందు జాగ్రత్త చర్యగా పూడికతీత పనులు చేపడుతున్నారు. ఈఈ రాజ్‌కుమార్ నేతృత్వంలో డిప్యూటీ ఈఈలు రామచంద్రరాజు, శ్రీరాములు, ఏఈలు అవినాశ్, భరత్, న్యాక్ ఏఈ వెంకటేశ్‌తో కలిసి పనులు చేపడుతున్నారు.





## హైటెక్స్‌లో 'ది గిగిల్ ఫెస్ట్' కార్నివాల్

బంజారాహిల్స్, మార్చి 28: వేసవికాలంలో వినూత్నమైన షాపింగ్ అనుభవంతో పాటు ఫ్యామిలీ మొత్తం సరదాగా గడిపేందుకు వీలుగా మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏప్రిల్ 21న 'ది గిగిల్ ఫెస్ట్' పేరుతో ఫ్యామిలీ కార్నివాల్ నిర్వహించనున్నారు. గురువారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో హీరోయిన్లు ప్రియాంకచౌదరి, కృతికారాయ్, మిస్ ఇండియా తెలంగాణ–2024 ఉర్మిళచౌహాన్ తదితరులు సందడి చేశారు. కార్నివాల్‌కు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. విదేశాల్లో జరిగే షాపింగ్ ఫెస్టివల్స్‌ను తలదన్నేలా అత్యంత భారీ ఎత్తున గిగిల్స్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 35వేల చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఏసీ ప్రాంగణంలో 150కి పైగా స్టాళ్లు, బ్రాండ్లతో పాటు ప్లే జోన్స్, మ్యూజికల్ కాన్సర్ట్స్ నిర్వహించనున్నామన్నారు.

## కార్మికుల భద్రతపై యాజమాన్యాల నిర్లక్ష్యం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 28: కాటేదాన్ పారిశ్రామికవాడ పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా మేనేజ్‌మెంట్ తగుచర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. పహల్ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించడంతో పరిశ్రమను ఆయన సందర్శించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. పరిశ్రమలో వందలాది మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నా, ఫైర్ సేఫ్టీ పరికరాలు సరిగా లేవని అన్నారు. అగ్నిమాపక భద్రతా పరికరాలు పనిచేస్తే అగ్ని ప్రమాదం జరిగేది కాదన్నారు. ప్రతి పరిశ్రమలో ఫ్యాక్టరీస్ డైరెక్టర్స్, ఫైర్ సేఫ్టీ, కార్మిక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకుంటే ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



పరిశ్రమను సందర్శించిన ఏఐటీయూసీ నాయకులు

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 28 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతు బజార్‌లో గురువారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) క్రింది విధంగా ఉన్నాయి. టమాట 15, వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 55, బజ్జి మిర్చి 45, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజి 21, ఫ్రెంచ్ బీన్స్ 65, క్యారెట్ 23, కాలీఫ్లవర్ 18, దొండ 20, చిక్కుడు 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 70, ఆలుగడ్డ 25, కీరా 25, దోసకాయ 18, సొరకాయ 9, పొట్లకాయ (1) 18, కందగడ్డ 65, ఉల్లిపోరక 40, ఉల్లిగడ్డ 22, మామిడికాయ(1) కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.